అతను మళ్ళీ వచ్చాడు. "కాంతం నీకూ నాకూ తగువులూ ధర్మాలూ ఏమిటి?" ఏదో అనునయంగా చెప్పబోతున్నాడు.

తన భుజంమీద ఉన్న అతని చెయ్యి విసురుగా వెనక్కి తోసేస్తూ, "జీవితకాలమంతా నన్ను మోసగించాలనే అనుకుంటున్నారా?" అంది కాంతం, ఆమె కన్నుల్లో రోషం దుఃఖం నిస్సహాయతా!

# ఓ అబల లేక కుంతి

అతను నవ్వాడు "నేను నిన్ను మోసంచేశానా?" అని నొక్కి పలుకుతూ.

"పోండి" అంది తలలోని మల్లెల్ని వంగి వాసనచూస్తున్న అతన్ని.

"ఇవాళకాదు రేపు" అన్నాడు అతను మొండిగా.

'అక్కరలేదు ఇప్పుడే- ఇవ్వాళే వెళిపొండి' అంది కాంతం విసుగ్గా.

"బస్సులు లేవు."

"అయితే ఏ లాడ్జికో పొండి."

"నువ్వుకూడా వస్తావా?"

"మీకు సిగ్గులేదు"

"ఎందుకటా సిగ్గు?"

ఆమె మాట్లాడలేదు. ఎప్పుడూ అతనంతే తను సీరియస్‌గ చెప్పిన మాటలన్నీ దూది పింజెల్లా గాలిలోకి ఊదేస్తాడు. తామిద్దరి మధ్య ఎటువంటి అభిప్రాయ భేదాలూ లేనట్టు నవ్వుతూ, నవ్విస్తూ గడిపేసి పోతాడు.

తానెందుకు లొంగిపోతూంది? ఈ ప్రశ్నకు ఆమెకు అతనితో సంబంధం ఏర్పడిన ఈ ఇరవై సంవత్సరాల్లోనూ జవాబు దొరకలేదు అతను అందంగా, హుందాగా వుంటాడు. అతని చూపుల్లో చిలిపితనం, నవ్వులో అల్లరి! తనేమన్నా లక్ష్యపెట్టని అతని వైఖరికి తాను వశమయిపోతుంది. అతను వస్తున్నానని ఉత్తరం వ్రాయకుండా సడన్‌గా వచ్చేస్తాడు. తనేదన్నా క్యాంప్‌లో వుంటే తాను వచ్చేవరకు వేచి వుంటాడు.

కొన్ని నెలలుగా తామిద్దరి మధ్య ఇదే సంభాషణ. ఆ రాత్రి అతని కిష్టమయిన వంటకాలతో భోజనం పెడుతుంది. "వద్దు. రాను" అని మురిపిస్తూనే అతని పక్కనే చేరుతుంది కాంతం.

అతనేమీ ఆమెకు డబ్బివ్వడు. "నా డబ్బు నీ కెందుకులే కాంతం! నీ జీతం నీకుంది" అంటాడు నవ్వేస్తూ. ఎప్పుడైనా పండగలకీ ఆమెకీ, ఆమె ఇద్దరి కూతుళ్ళకీ బట్టలు కొంటాడు దానికే పొంగిపోతుంది కాంతం. "మా ఆయన కొన్నాడు" అని అందరికీ సంబరంగా చూపిస్తుంది.

ఆయన ఆమె దగ్గరకు రావడమే తప్ప అతని దగ్గరకి ఆమె ఎప్పుడూ వెళ్ళలేదు. కొత్తలో రెండు మూడు సార్లు అంది "మీతో వచ్చి నాలుగు రోజులుంటానండీ" అని. దానికతను ఇబ్బందిగా ముఖంపెట్టి, "ఇప్పుడుకాదు ఈసారివచ్చినప్పుడు తీసుకు వెళతానుగా!" అని తప్పించుకున్నాడు.

అస్సలతను ఎవరో అతని సంప్రదాయమేమిటో, అతనెలాటి మనిషో, అతని స్థితిగతులేమిటో తెలియకుండానే అతనికి లొంగిపోయింది కాంతం.

ఆమె అతనికి ఇష్టమైన బంగాళాదుంపల వేపుడు చేస్తూంది. "అలా వీధిలోకి వెళ్ళి వస్తాను" అని అతను బయటకు వెళ్ళి పోయాడు.

వచ్చేప్పుడు పువ్వులు స్వీట్లు తెస్తాడు. తమ పక్క వేరు గదిలో వెయ్యమంటాడు. తను అలాగే చేస్తుంది. అతనిచేతుల్లో నలిగిపోతుంది. తెల్లవారుజాము నాలుగు గంటలకే అతను బెడ్ కాఫీ తాగి వెళ్ళిపోతాడు.

## గుండె గుడిలో

నీ కన్నులలో కంటిపాప నవ్వాలనుకొన్నా
ఎంతగా ఎదురుచూశాను నీవు రాలేదని
నేనొక ఫలంగా నీ కర్పణమైపోతాను



నన్నో చిరుదివ్వెగా వెలగనీ
నీ గుండెగుడిలో శాశ్వతంగానిలిచిపోవాలని,

—డి. అహల్యా

మళ్ళీ ఎప్పుడు వస్తాడో చెప్పడు. తను అడగదు.

స్టౌ మీద దుంపలు కలుపుతూన్న ఆమెకు గతం గుర్తు రాసాగింది.

* * *

కాంతం వరలక్ష్మమ్మకి ఒక్కతే కూతురు. కాంతం మూడేళ్ళపిల్లగా ఉన్నపుడే తండ్రి కాలంచేశాడు. వరలక్ష్మమ్మ కూతుర్ని గారంగా పెంచిందనే చెప్పాలి. అంతేకాదు, ఆమెకు స్వేచ్ఛా స్వాతంత్రాలు యిచ్చింది. కాంతం పెద్దదయి స్కూలు ఫైనలు అయ్యేసరికి ఇల్లూ వాకిలీ కరిగిపోయి పొట్ట చేతికి వచ్చింది. అప్పుడే వరలక్ష్మమ్మ కూతుర్ని జి.ఎస్. పోస్టులో ప్రవేశపెట్టింది.

రెండు సంవత్సరాలు గడిచాయి. కాంతానికి కొత్త జీవితమే ఉద్యోగంతో వచ్చింది ఆమెను అనుభవించాలనే ఆరాటంతో ఆమె వెనుక తిరిగేవారు. ఆమె లొంగనిపక్షంలో ఇబ్బందులకు గురిచేసే అధికారులూ, ఉద్యోగ జీవితంలో ఎంత గలీజుందో తెలుసుకుంది కాంతం. ఒక్కొక్కప్పుడు "నేనీ ఉద్యోగం మానేస్తానమ్మా" అని తల్లి దగ్గర ఏడ్చేసేది. ఇంతకన్నా ఏ స్కూలు టీచరమ్మనయినా అయితే హాయినా గౌరవంగా బతికేదాన్ని అనుకునేది.

"నువ్వు ఉద్యోగం మానేస్తే ఎలా బ్రతకగలవు తల్లీ" అని కూతుర్ని ఓదార్చి పెళ్ళి సంబంధాలు చూసేది వరలక్ష్మమ్మ. చాలా సంబంధాలు వచ్చాయి కానీ ఏదీ కుదరలేదు. వారడిగే పెద్దపెద్ద కట్నాలిచ్చే స్తోమత లేక కొన్ని, కాంతం చేసే ఉద్యోగం తెలుసుకుని వెనక్కి వెళ్ళిపోయిన సంబం

ధాలు కొన్ని వరలక్ష్మమ్మ ఆరోగ్యం దెబ్బ తింది.

అప్పుడే ఆ ఇంటికి పరిచయమయ్యాడు. డాక్టరు కృష్ణమూర్తి. ఫీజు తీసుకోకుండా వరలక్ష్మమ్మకు వైద్యం చేసేవాడు. అతను తన తల్లికి ఎంతో నిస్వార్థంగా వైద్యం చేస్తున్నాడనీ అతను చాలా మంచివాడనీ, ఇలాటి డాక్టర్లు నూటికి ఒక్కరు కూడా వుండరని, అతన్ని అమితంగా మెచ్చుకునేది కాంతం.

అతనికి కాఫీ ఫలహారాలు బలవంతంగా పెట్టేది. "వద్దు కాంతం నీ దగ్గర ఇలాటి లంచాలు తీసుకోవటం నాకు ఇష్టంలేదు" అనేవాడు కృష్ణమూర్తి. అతను తనదగ్గర నుంచి పెద్ద లంచమే తీసుకోబోతున్నాడని తెలియని కాంతం "నేనింతకన్నా ఏమివ్వగలను డాక్టర్. జీవిత కాలమంతా కృతజ్ఞురాలనై ఉంటాను. అంతే" అంది కాంతం. కృతజ్ఞతాభావంతో కనురెప్పలు తడుస్తుండగా ఓరోజు.

ఆమె బుజంచుట్టూ చెయ్యివేసి,తలనిమిరి "మరేం భయంలేదు నేను నీకెప్పుడూ తోడుగా ఉంటానుకదా!" అన్నాడు కృష్ణమూర్తి.

అతని ఆ చనువును అపార్థం చేసుకోలేదు కాంతం. తన కెవ్వరూ లేరనే జాలితోనే అలా ప్రవర్తించాడనుకుంది.

ఓ రోజు వరలక్ష్మమ్మ డాక్టరు కృష్ణమూర్తికి కూతుర్ని అప్పగించి కనులు మూసింది.

అప్పటికి పాతిక సంవత్సరాల కాంతం యౌవ్వనపు అందంతో ఆకర్షణీయంగా వుండేది. వరలక్ష్మమ్మ పోయినా కృష్ణమూర్తి కాంతం ఇంటికి రావడం మానలేదు. సాయంత్రం హాస్పిటలు మూసిన వెంటనే స్కూటరు వేసుకు రావడం ఆ రాత్రి వుండి మర్నాడు వెళ్ళడం చేసేవాడు.

## భూస్వామితో బానిస

"ఆవాకే గనక
నాలుగు కాళ్ళుంటే
వాటిని
మంచం కోళ్ళుగా
చేసుకొని
నా వీపు మీద
పడుకొనుండే వాడివి
నువ్వు!"

—పి. బి. వెంకటపతిరాజు


"బాగున్నావా కాంతం" అని పలకరించి, ఆమె ఇచ్చే ఆతిథ్యం స్వీకరించి "ఇపుడీ రాత్రిలో ఇంటికి వెళ్ళలేను" అంటూ చలి కిలబడటం అతనికి మడతమంచం పరుపు కాంతం వెయ్యటం పరిపాటయింది. కొన్నాళ్ళకు ఇరుగు పొరుగుల గుసగుసలు కాంతం చెవినపడినా ఆమె లక్ష్యపెట్టలేదు. ఆమె వుండే వూరికి పదిమైళ్ళ దూరంలో వుండే పట్నంలో వుండేవాడు కృష్ణమూర్తి.

ఓ నాటి రాత్రి భోజనం చేస్తూ "కాంతం నేనొక అభిప్రాయానికి వచ్చాను నువ్వు కాదనవనే అనుకుంటాను అన్నాడు."

ఆమె కొంచం కంగారుపడి సర్దుకుంది. ఇతనేం చెప్పబోతున్నాడు అని. కాని వెంటనే సర్దుకుని, "ఏమిటది?" అంది నేల చూపులు చూస్తూ.

"నువ్వు చాలా అందంగా వుంటావు" అన్నాడు.

ఆమె మరికాస్త తల వంచింది.




నిన్ను చూడకుండా వుండలేక పోతున్నాను.

మౌనమే సమాధానం.

రెండు మూడు నిమిషాల నిశ్శబ్దం తర్వాత బాంబు పేల్చినట్లు "నువ్వు నాకు కావాలి కాంతం" అన్నాడు కృష్ణమూర్తి.

"ఏమండీ మీరు చాలా మంచివారనుకున్నాను." అందామె వణికే స్వరంతో తలెత్తి.ఇతనిలా కోరుతున్నాడా? అని నవ్వలేనట్లు అతని వైపు చూస్తూ.

"మంచివాణ్ణే కాదని ఎవరన్నారు?" గలగలా నవ్వాడు కృష్ణమూర్తి.

ఆమె ఈ ఉద్యోగంలో చేరిన తర్వాత మగవాళ్ళ చాపల్యాలు ఆడదాన్ని పలలో వేసుకునే ఎత్తులూ ఎలా వుంటాయో కొంత తెలుసుకుంది. వి. డి. ఓ. వెంకట్రామ్ చెల్లెమ్మా అని పిలుస్తూ, బజారు నుంచి తెచ్చిన కూరల్లో తనకు వాటాయిస్తూ ఆత్మీయుణ్ని ప్రవర్తించి ఓనాటి అర్థరాత్రి తలుపు తట్టి చెయ్యి పట్టుకున్నాడు.

ఎస్. ఇ. జగన్నాథం నిన్ను రెండో పెళ్ళాంగా వుంచేసుకుంటాను. అని బతిమిలాడి బలవంతం చెయ్యబోతే తను అల్లరి చేసేసింది. అతను చాలా రోజులు తనమీద పగబట్టి బిడిఒకి ఎమ్ఎస్‌కి పోటీ లెక్కించి సర్వీసులో చికాకులు పెట్టించాడు.

బి డి ఒ రఘురామయ్య మర్యాదగా మాట్లాడుతూనే వెకిలి చేష్టలు చేసేవాడు పెద్ద పని వున్నట్లు తన ఆఫీస్ రూమ్‌లోకి పిలిచి

ఎలాటి చికాకులయినా ఎదుర్కొని శీలాన్ని కాపాడుకుందే కాని ఎక్కడా కాలు జారలేదు. కాని ఈ డాక్టరు?

తలవంచి భోజనం చేస్తూన్న అతని ముఖంలోకి చూసింది. తన తల్లికి ఆరు నెలలు వైద్యం చేశాడు. కాఫీ టిఫిన్లు తప్ప అతనికి తానేమీ డబ్బు ఇవ్వలేదు ఆమె పోయినా తన యోగక్షేమాలు విచారిస్తూ తన దగ్గరకి వస్తున్నాడు! ఇతను తప్ప తనను ఆదుకున్నవారెవరున్నారు! బంధువులెవరికీ తనమీద సదభిప్రాయం లేదు, తనకి పెళ్ళి అయ్యే అవకాశాలు దరిదాపుల్లో లేవు. కోరి అడిగిన ఇతన్ని ఎందుకు కాదనాలి? అందం, చదువు ఉద్యోగం, ధనం ఇతనికేం తక్కువ? ఇటువంటి భర్త తను తల నేలకి కాళ్ళు మీదికి పెట్టి తపస్సు చేసినా లభ్యమవుతాడా?

"నన్ను పెళ్ళి చేసుకుంటారా?" లోతుకు పోయిన స్వరంతో ప్రశ్నించింది.

"ఇంతకాలం మన పరిచయంలో ఇదే అన్నమాట నా గురించినీవు తెలుసుకున్నది. నన్ను అర్థంచేసుకున్నది!" అని నిష్ఠురమాడాడు. కృష్ణమూర్తి

"అహ అది కాదు" తడబడిందామె.

"మరి? నా మీద నమ్మకం లేదన్నమాట.



కావిలిపాటి విజయలక్ష్మి

నేను మోసగాణ్ణి అనుకుంటున్నావా?"

"అబ్బె అదేంలేదండి. కాని...." అని అతని కంచంలో ఓ గరిటె అన్నం వేసి పెరుగు పోసింది.

....మళ్ళీ సందేహం "కాని నేను మోసం చేస్తానేమో అని అంటూ పిచ్చి కాంతం మైడియర్ కాంతం. ఎంత అమాయకు రాలివి" అని ఆమె తల ఎడంచేత్తో పట్టి ఊపాడు కృష్ణమూర్తి.

ఆరాత్రి అతను తన పక్కలో చోటు చేసుకుంటె కాదనలేదు కాంతం.

అదొక మత్తు.అదొక ఆనందం.ఎప్పుడూ ప్రతిరోజూ కృష్ణమూర్తి తనతోటి గడపా లని కోరిక. అతను వరసగా నాలుగురోజులు రాకపోయేసరికి అలక నటించేది కాంతం. అతను బ్రతిమిలాడుతూంటె గారాలు పోయేది. అతని గురించి తన ఫ్రెండ్సుతో. పరిచయస్తులకి అతను నన్ను పెళ్ళిచేసు కుంటాడని కొన్నాళ్ళు. ఐదారు నెలలు గడి చాక మాకు పెళ్ళి అయిపోయిందని చెప్పింది కాంతం. పెళ్ళి అనేసరికి పెళ్ళున నవ్వి "ఎప్పుడోలే సేసుకుంటాను లెద్దూ! డాక్టర్ కృష్ణమూర్తి భార్యగా చెలామణీ అయిపోతున్నావుగా!" అనేవాడు తను.

"మీ ఊరు తీసుకెళ్ళండీ! మీ బంధువు లకి నన్ను పరిచయం చెయ్యండీ" అని అప్పుడప్పుడు అడిగేది కాంతం. అతను చిన్న ఉపన్యాసం ఇచ్చేవాడు వాళ్ళకి నామీద చాలా కట్నం రాబట్టుకోవాలనీ దానితో మా చెల్లెల్కి పెళ్ళి జరిపించాలనీ వుంది. నా కసలు కట్నం తీసుకోవటం ఇష్టంలేదు. అని కట్నాలవల్ల ఆడపిల్లలు ఎలా అన్యాయమయిపోతున్నారో దేశంలో! అని బాధపడి పోయి "కొంచం రోజులు ఆగు. ఒక్కసారి అందర్నీ ఆశ్చర్యంలో ముంచేస్తాను" అనే వాడు.

ఒకరోజు ఉదయం లేస్తూనె వాంతి అయింది కాంతానికి. నెలలు లెక్కకట్టి కంగారు పడింది. నాలుగు రోజుల తర్వాత వచ్చిన కృష్ణమూర్తికి చెప్పింది ఈ వార్త. అతను ఓసారి కనుబొమలు చిట్లించి, "ఓ తల్లివి కాబోతున్నావన్నమాట. సంతోషమే. వుంచుకోవటమో మానెయ్యటమో నీ ఇష్టమే వద్దనుకుంటే మంచి మందిస్తాను. ఈజీ! మామూలు మనిషివయిపోతావు" అన్నాడు.

"ఎందుకు వద్దనుకోవాలి! మీరు నన్ను వెంటనే పెళ్ళిచేసేసుకోండి" అంది కాంతం కొంచం కోపంగా.

"పెళ్ళి అంటె ఎలా చేసుకోవాలి?" అని నవ్వి "పెళ్ళి అయిపోయిందని మంగళ సూత్రాలు ఎప్పుడో మెడకు తగిలించు కున్నావుగా!" అన్నాడు.

"అది చుట్టూతా ఉన్న వాళ్ళను నమ్మించ టానికి. పోనీ రిజిష్టర్ మేరేజ్ చేసుకోండి" అంది కాంతం.

"అందరికీ ఆ రిజిష్ట్రారు ఆఫీసువాళ్ళకి కూడా తెలుసు నువ్వు నా భార్యవని. కొత్తగా పెళ్ళి అంటే నవ్వరూ!" అన్నాడు తను నవ్వుతూ కృష్ణమూర్తి.

మూడు సంవత్సరాల్లో ఇద్దరు పిల్లల తల్లి అయిపోయింది కాంతం. మరి పిల్లలు పుట్టకుండా అపరేషను కూడా చేయించు కుంది. ఈ లోపల ఆమె మత్తు కాస్త

## ఢిల్లీ క్రీడల పరిహాసం

ఆసియా క్రీడల పటాటోపాలు
రెండువేల పావురాలుగా
ఐదువేల బూరలుగా
ఢిల్లీ పాలకుల కలలు
శూన్యం లోకి ఎగిరిన
ప్లాస్టిక్ ఏనుగులు!

గ్రామాల పిడచకడుతున్న నాలుకలు
"భారత" ప్రజాస్వామ్యపు-
ఎండమావుల వెంట
తాగే నీటిబొట్లకై ఎడతెగని పరుగు
మెతుకుల కోసం దేవులాడే వేళ్ళు
ఢిల్లీ ఆహారం
జిగేలు మనిపించిన మెరుపుల్లో
బోగగా మిగిలిన ఆశలు!

వందలకోట్ల ఖరీదైన పరిహాసంలో
కూలేముందు భగ్గనముండే
అధికారపు మేడలు
సమ్రాట్చక్రవర్తుల సయవంచనా విన్యా
సాలు!

—నిఖిల్

విడింది. డాక్టరుకి తనతో సంబంధం ఏర్ప డక ముందే భార్యా పిల్లలు ఉన్నారని తనను మళ్ళీ పెళ్ళి చేసుకోవడానికి ఆమె అంగీక రించదనీను. డాక్టరుమీద చాలా కోపం వచ్చింది కాంతానికి. అతన్ని నువ్వు నన్ను మోసం చేశావంటూ ఇష్టం వచ్చినట్లు నిందారోపణలు చేసింది. అన్నీ విని చిన్నగా నవ్వుతూ, "కాంతం! నువ్వెప్పుడయినా మీకు పెళ్ళి అయిందా! అని ప్రశ్నించావా? కాంతం. నువ్వు అలా అడిగినప్పుడు నేను అబద్ధం చెబితే బాధపడవచ్చు. కాని ఇప్పుడు నీకేమిటి తక్కువయిందని? కొంపలంటుకు పోయినట్లు అలా అరుస్తావేమిటి! నేను నీకు భర్తగా నిల్చున్నాను కనుక నువ్వు సుఖంగా బ్రతుకుతున్నావు. లేకపోతె ప్రతి వెధవా నీ చెయ్యి పట్టుకోడానికి జంకడు. సంతోషించాల్సిందిపోయి మోసం చేశానని ఏడుస్తావేమిటి" అని చిరాకుపడిపోయాడు.

గమ్మున ఊరుకుంది కాంతం. అతనన్న మాటలన్నీ నిజమే. తనేదో మత్తులో అతనంటె విపరీతమైన ఇష్టంతో అతని వివరాలేమీ అడిగి తెలుసుకోలేదు.

"పోనీ.... అంతా తప్పేనండి! కాని మీకిది న్యాయంగా వుందా! భార్యా పిల్లలు వుండి నన్నిలా మోసగించటం?" ఏడుస్తూ ప్రశ్నించింది కాంతం.

"అదిగో అదే వద్దంటాను- నిన్నేమిటో మోసంచేశానని?" చిరుకోపం ప్రదర్శించాడతను.

"పెళ్ళి చేసుకోరెందుకని!"

"ఫూల్— మళ్ళీ మొదటికి వస్తావు. ఇడీయట్ ఈసారి ఇలా వేధిస్తే అస్సలు నీ ఇంటికి రాను" అన్నాడతను ఖచ్చితంగా.

మౌనం వహించింది కాంతం.

అతను తరచుగా రావటం తగ్గించాడు. ఆడపిల్లలు వాళ్ళ భవిష్యత్ గురించి ఆలోచించే కాంతం ఆరోగ్యం దెబ్బతింది.

పిల్లలను చదివిస్తూంది అప్పుడప్పుడూ కృష్ణమూర్తి వచ్చి ఓ పూట గడిపి వెళ్ళిపోతూ వుంటాడు. నాన్నగారూ! అని పిల్లలు ఏవేవో చెబుతారు. వింటాడు. అతనికి పిల్లలంటే అభిమానముందో లేదో తెలియదు కాని అభిమానమున్నట్లే నటిస్తాడు.

చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు పిల్లలు తల్లిని ప్రశ్నించేవారు— నాన్నగారు మన ఇంట్లోనే ఎందుకుండరని, అతని ఇంటికి మనం ఎందుకు వెళ్ళమనీ తల్లిని. ఆమె ఏవేవో కల్లబొల్లి మాటలు చెప్పి వారిని మరపించేది.

తర్వాత వాళ్ళకి తెలిసింది తమ తండ్రికి మరో భార్యా పిల్లలూ ఉన్నారని వాళ్ళదగ్గర ఉంటాడనీను. ఆమెకు ప్రమోషనువచ్చి మరో ఊరు ట్రాన్స్ఫర్ అయింది. అక్కడికీ వచ్చేవాడు కృష్ణమూర్తి.

* * *

లాడ్జికి నన్ను పిలవటానికి సిగ్గులేక పోయింది. పిల్లలు పెళ్ళికెదిగారుకాని మీ బుద్ధులేమీ మారలేదు. ఇవ్వాళ ఖచ్చితంగా మిమ్మల్ని ఒకటి అడగదలచాను" అంది కాంతం.

"ఏమిటది?" అడిగాడు కృష్ణమూర్తి.

"పెద్దదాన్ని మొన్న ఎవరో స్టూడెంటు అల్లరి పెట్టాడట. దానికి ముందుగా పెళ్ళిచెయ్యాలి. పిల్లలకు సంబంధాలు చూసి పెళ్ళిచెయ్యాలి."

"చేసెయ్ పెళ్ళిళ్ళు- నేను వద్దన్నానా?" అన్నాడు కృష్ణమూర్తి ఆమె మాటకు అడ్డంవస్తూ.

"సంబంధం చూడటం తండ్రిగా అది మీ బాధ్యత."

ఓ.... అని అదోలా నవ్వి. "తల్లి కూడా పిల్లలకు పెళ్ళిళ్ళు చెయ్యవచ్చు" అన్నాడు సీరియస్‌గా సిగరెట్ పొగ గాలిలోకి వదులుతూ.

"చెయ్యొచ్చు. కాని నాకాశక్తి లేదు" అంది కాంతం.

"చేద్దాంలే. ఎందుకు సైము కరాబు చేస్తావ్? రా ఇలా వచ్చి కూర్చో."

"నా బ్రతుకే కరాబయిపోయింది. పిల్లల బ్రతుకులు కరాబవకూడదు. వాళ్ళ పెళ్ళిళ్ళకో పాతికవేలు బ్యాంకిలో వాళ్ళపేర డిపాజిట్ చెయ్యండి."

"ఇంకా...."

"వేళాకోళంకాదు."

"అందుకే జాగ్రత్తపడి అప్పుడే కనకు అన్నాను. విన్నావుకాదు అనుభవించు."

"ఏమండీ!" కాంతం కనులు ఎర్రబారాయి.

"అబ్బో ప్రమోషను వచ్చిందని మిడిసిపాటు కాబోలు."

"మాటలు జాగ్రత్తగా రానీండి. ఉత్త కుక్కలా అవసరం తీర్చుకునే మనిషని మిమ్మల్ని అనుకోలేదు." రెచ్చిపోయింది



కాంతం. కసిగా ఇంకెన్నో మాటలంది.

"నోరుముయ్. ఎన్నో చేతులు మారి నన్ను మొగుణ్ణని చెప్పుకునే నువ్వు...."

అతని చెంప ఛెళ్ళుమంది. "గెటవుట్" వీధి గడపవైపు చెయ్యి చూపించింది కాంతం.

విసురుగా పెద్దపెద్ద అంగలు వేస్తూ వెళ్ళిపోయాడతను.


దోసిట్లో మొహం దాచుకుని వెక్కి-వెక్కి- ఏడవడం ప్రారంభించింది కాంతం.

"ఊరుకోమ్మా ఏడవకమ్మా! మనకేం నీ ఉద్యోగముంది. మేమూ ఎలానో బ్రతుకుతాం మా గురించి బెంగపడకమ్మా!" తల్లిని ఓదార్చారు పద్దినిమిదేళ్ళ రమ, పదహారేళ్ళ లక్ష్మి.కనులు తుడుచుకుని లేచి ఇంటిపనుల్లో నిమగ్నమయింది కాంతం.

పెళ్ళికాకుండా అతనికి లొంగిపోవటం తనదే తప్పు. అతని రూపం. చూపులు. మాటలూ తనను మత్తులో ముంచి చిత్తుగా ఓడించాయి.తననుతాను తిట్టుకుంది కాంతం.

రోజులు గడుస్తున్నాయి.

ఆ రోజు మహిళామండలి భవనంలో మీటింగు.




హాలంతా ఆడవాళ్లు, పిల్లలతో కిటకిటలాడుతూంది.

అధ్యక్షత వహించిన తాశీల్దారుగారిభార్య మైకులో చెబుతూంది:


"ఇప్పుడు ఎమ్. ఎస్. గారు. స్త్రీల సమస్యల గురించి. సమాజంతో స్త్రీ పురుషుల నుంచి తనను తాను రక్షించుకుంటూ ఎలా మెసలాలి ముఖ్యంగా వివిధ సంస్థల్లో ఉద్యోగాలు చేసే స్త్రీలు వాళ్ళ ఆర్థిక సమస్యలు, పిల్లల పెంపకం గృహ నిర్వహణ అన్నీ చెబుతాడు" అని కూర్చుంది

ఎమ్. ఎస్. కాంతం నోట మాటరాని శిలాప్రతిమే అయింది క్షణం. తర్వాత ఆవేశంగా. ఉద్వేగస్వరంతో. వరకట్నాలతో ప్రారంభించి. దేశంలో జరుగుతున్న మానభంగాల వరకూ పొడిగించి కృష్ణమూర్తిని దృష్టిలో పెట్టుకుని ఉపన్యాసమిచ్చింది కాంతం— స్త్రీలు అన్యాయమైపోతున్నారని.

హాలులో చప్పట్లు మారుమ్రోగాయి!

కాంతం గుండె మూలిగింది నీరసంగా.

జీవితం చాలా అపురూపమైనది జీవించండి దర్జాగా



బ్రిల్ క్రీమ్ హెయిర్ డ్రెసింగ్
మీ జీవనశైలికి వన్నె తెస్తుంది.




ఉచితం!

"హౌ టు లుక్ స్మార్ట్ అండ్ ఫీల్ కాన్ఫిడెంట్" అన్న మా చిన్న పుస్తకం కోసం వ్రాయండి. జాడీ మూత లోపలి కార్క్‌తోపాటు 70 పైసల స్టాంపు జతపరిచి, ఈ క్రింది చిరునామాకు పంపండి.

హెచ్. ఎమ్. ఎమ్. లిమిటెడ్, డిపార్ట్‌మెంట్
ABW, 1 జై సింగ్ రోడ్, న్యూ ఢిల్లీ-110001

OBM/5829 Tel